APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ సోమవారం 29, జూన్ 2026 సంపుటి: 01 సంచిక :34 పేజీలు : 04 వెల: 2-00/-

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష

- జంతర్‌మంతర్‌లో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభం
- విద్యా వ్యవస్థలో పారదర్శకత కోరుతున్న పర్యావరణవేత్త
- నీట్ సహా పరీక్షల నిర్వహణపై కేంద్రాన్ని ప్రశ్నించిన వాంగ్‌చుక్

న్యూఢిల్లీ, జూన్ 28 : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్



2లో



2లో

## రూ.13,060 కోట్లతో రాష్ట్ర రహదారుల విస్తరణకు శ్రీకారం

- హెచ్‌ఏఎం విధానంలో 6,092 కి.మీ. రహదారుల అభివృద్ధి
- నల్గొండలో పైలాన్ ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి
- 34 ప్యాకేజీల్లో 441 రహదారుల విస్తరణ

నల్గొండ, జూన్ 28 : తెలంగాణలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) విధానంలో చేపట్టనున్న

## సౌదీలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం

- అరామ్కో హెలికాప్టర్ కుప్పకూలి 14 మంది మృతి
- రస్ తనూరా సమీపంలో విషాద ఘటన
- ప్రమాదంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశాలు



2వ పేజీలో

## సీఎం, ఉప ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత



2లో

- జూలై 2 పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం
- ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు
- అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాలు

తిరుపతి, జూన్ 28 : జూలై 2న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తిరుపతి జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. పర్యటన ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. పర్యటన మార్గాలు, సభా ప్రాంగణాలు, ముఖ్య కూడళ్లు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పర్యటన సందర్భంగా సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని, ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలకు ముందుగానే సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.



## సెషెల్స్‌తో బంధం మరింత బలోపేతం: మోదీ

విక్టోరియా (సెషెల్స్), జూన్ 28 : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెషెల్స్ జాతీయ అసెంబ్లీలో ప్రసంగిస్తూ ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, పరస్పర విశ్వాసం, అభివృద్ధి లక్ష్యాలే భారత్--సెషెల్స్ భాగస్వామ్యానికి బలమైన పునాదులని అన్నారు. సెషెల్స్ ప్రజలు అందించిన ఆత్మీయ స్వాగతం, ఆతిథ్యానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భారత్, సెషెల్స్ మధ్య ఉన్న దీర్ఘకాలిక భాగస్వామ్యం సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నియంత్రణ, సుస్థిర అభివృద్ధి వంటి కీలక రంగాల్లో మరింత విస్తరిస్తోందని ప్రధాని చెప్పారు. చిన్న ద్వీప దేశాల అభివృద్ధికి భారత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పరస్పర సహకారంతో కొత్త అవకాశాలను సృష్టించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

## పోలియో నిర్మూలనకు మూడు రోజుల మహాయజ్ఞం



2వ పేజీలో

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన సీఎం
- 49.20 లక్షల మందికి లక్ష్యంగా కార్యక్రమం
- ప్రతి చిన్నారికి టీకా అందించాలని పిలుపు

అమరావతి, జూన్ 28 : జాతీయ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడారు.



2లో

## వరద ముప్పుకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- రూ.9.95 కోట్లతో వరహానది రక్షణ గోడ
- సోముదేవుపల్లిలో మంత్రి అనిత శంకుస్థాపన
- గ్రామాలు, వ్యవసాయ భూములకు రక్షణ కల్పించడమే ధ్యేయం

అనకాపల్లి, జూన్ 28 : వరదల నుంచి ప్రజల ప్రాణాలు, వ్యవసాయ భూములను రక్షించేందుకు అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం మండలం సోముదేవుపల్లి గ్రామంలో రూ. 9.95

## మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ

- కావలిలో రెహమాన్ చిత్రపటానికి నివాళులు
- కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా
- ఎమ్మెల్యేతో కలిసి పరామర్శించిన మంత్రి పొంగూరు నారాయణ



2వ పేజీలో

## సీజనల్ వ్యాధుల నియంత్రణపై అప్రమత్తం

- ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య అధికారులతో మంత్రి సమీక్ష
- డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- గ్రామ స్థాయిలో యాక్టివ్ సర్వైలెన్స్‌కు ఆదేశాలు

విశాఖపట్నం, జూన్ 28 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన జిల్లాల వారీగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.



2లో

## మరో రెండు రోజులు వర్షాల హెచ్చరిక

- ద్రోణి ప్రభావంతో మేఘావృత వాతావరణం
- మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



2లో

# సీఎం, ఉప ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

(మొదటిపేజీ తర్వాత)

అవసరమైన చోట ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసి రాకపోకలు సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భద్రతా విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది అప్రవత్తంగా విధులు నిర్వహించాలని, ప్రతి అంశాన్ని సమన్వయంతో అమలు చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు. పర్యటన విజయవంతం కోసం పోలీసు శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు కూడా సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రజల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని జిల్లా పోలీసు శాఖ వెల్లడించింది.



# వరద ముప్పుకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

(మొదటిపేజీ తర్వాత)

కోట్ల వ్యయంతో నిర్మించనున్న వరహానది రక్షణ గోడ పనులకు రాష్ట్ర మంత్రి అనిత ఆదివారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి (ఎస్డీఎంఎఫ్) ద్వారా ఈ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి వర్షాకాలంలో వరదల కారణంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శాశ్వతంగా తొలగించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రక్షణ గోడ నిర్మాణం పూర్తయితే గ్రామాలు, వ్యవసాయ భూములు వరద ముప్పు నుంచి సురక్షితంగా ఉంటాయని తెలిపారు. వరహానది ఉద్ధృతి వల్ల గతంలో జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ కూటమి ప్రభుత్వం వరద నివారణ చర్యలను వేగవంతం చేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన ప్రాంతాల్లో రక్షణ గోడలు, డ్రైనేజీ వ్యవస్థలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. వరదల నుంచి గ్రామాలకు శాశ్వత రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వం నిరంతరం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి అనిత స్పష్టం చేశారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణపై అప్రమత్తం

(మొదటిపేజీ తర్వాత)

. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రించేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, వార్డు సాయిలో యాక్టివ్ సర్వైలెన్స్ నిర్వహిస్తూ జ్వరాల కేసులను వెంటనే గుర్తించి పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, అధిక ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రే (ఐఆర్ఎస్), మాస్ ఫీవర్ సర్వేలు, ఫాగింగ్ కార్యక్రమాలు, దోమల నివారణ చర్యలను వేగవంతం చేసి వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. పారిశుద్ధ్య చర్యలు, నిల్వ నీటి తొలగింపు, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి నివారణ చర్యలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి పేర్కొన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని అవసరమైన మందులు, నిర్ధారణ పరీక్షల సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

# మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ

(మొదటిపేజీ తర్వాత)

కావలి, జూన్ 28 : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎస్సీ ఉద్యోగిగా పనిచేస్తూ ఇటీవల అకాల మరణం చెందిన జానీ తండ్రి రెహమాన్ కుటుంబాన్ని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ కలిసి పరామర్శించారు. కావలి పట్టణంలోని 40వ వార్డులోని వారి నివాసానికి వెళ్లి రెహమాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చిన ప్రజాప్రతినిధులు, రెహమాన్ మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ శాఖలో సేవలందించిన ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. ఉద్యోగి కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు,



కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మృతుడికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మరో రెండు రోజులు వర్షాల హెచ్చరిక

(మొదటిపేజీతర్వాత)

అమరావతి, జూన్ 28 : ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు రోజుల పాటు మేఘావృతమైన వాతావరణం కొనసాగడంతో పాటు పలు ప్రాంతాల్లో చెదురుమదురుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ఎండీ ప్రకర్ జైన్ తెలిపారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, జిల్లాల వారీగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. భారీ వర్షాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదులు, వాగులు, కాలువల సమీపంలో నివసించే వారు ప్రత్యేక అప్రమత్తత పాటించాలని సూచించారు. అవసరం లేకుండా వరద నీటిలోకి వెళ్లకూడదని, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు తాజా వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా పరిశీలించాలని, రైతులు కూడా వ్యవసాయ పనులు చేపట్టే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించాలని ఏపీఎస్డీఎంఏ విజ్ఞప్తి చేసింది. ప్రజలు అధికారిక వాతావరణ హెచ్చరికలను మాత్రమే నమ్మి అప్రమత్తంగా ఉండాలని ప్రకర్ జైన్ సూచించారు.

# భారీ ఫిషింగ్ ల్యాండింగ్ కేంద్రాలకు శ్రీకారం

**- రూ.48.67 కోట్లతో రెండు కేంద్రాల నిర్మాణం**
**- 8,500 మందికి పైగా మత్స్యకారులకు లబ్ధి**
**- మరో 4,440 మందికి ఉపాధి అవకాశాలు**

అనకాపల్లి, జూన్ 28: పాయకరావుపేట నియోజకవర్గంలోని మత్స్యకారుల చిరకాల ఆకాంక్షకు రూపుదిద్దుతూ రాజయ్యపేటలో రూ.48.67 కోట్ల వ్యయంతో నిర్మించనున్న దొండవాక, రాజయ్యపేట ఫిషింగ్ ల్యాండింగ్ కేంద్రాల (ఎఫ్ఎల్‌సీ) నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి అనిత, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం కింద ఈ కేంద్రాలను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ఆధునిక మత్స్య ల్యాండింగ్ కేంద్రాల ఏర్పాటు ద్వారా మత్స్యకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు వారి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. చేపల నిల్వ, రవాణా, మార్కెటింగ్‌కు అవసరమైన మౌలిక వసతులు ఈ కేంద్రాల్లో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 8,500 మందికి పైగా మత్స్యకారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని, అదనంగా 4,440 మందికి కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. తీరప్రాంత ప్రజల జీవనోపాధి మెరుగుపడటానికి ఈ కేంద్రాలు కీలకంగా నిలుస్తాయని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. మత్స్యరంగ అభివృద్ధికి అవసరమైన



మౌలిక వసతుల కల్పన, ఆధునికీకరణ, ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులు పూర్తి చేసి మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు తెలిపారు.

# పోలియో నిర్మూలనకు మూడు రోజుల మహాయజ్ఞం

(మొదటిపేజీ తర్వాత)

చిన్నారులను ఎత్తుకుని ముద్దాడుతూ వారి ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత రాష్ట్ర నిర్మాణానికి సహకరించాలని సూచించారు. అధికారుల వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఐదేళ్లలోపు ఉన్న సుమారు 49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాలు, మారుమూల ప్రాంతాలు సహా అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇంటింటికీ వెళ్లి అర్హులైన చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి వైద్య, ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఏ చిన్నారి కూడా ఈ కార్యక్రమానికి దూరం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సహకారంతో రాష్ట్రాన్ని పూర్తిస్థాయి పోలియో రహిత రాష్ట్రంగా నిలబెట్టాలని అధికారులు పిలుపునిచ్చారు.

# సౌదీలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం

(మొదటిపేజీ తర్వాత)

రియాద్, జూన్ 28: సౌదీ అరేబియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ రంగ చమురు దిగ్గజ సంస్థ సౌదీ అరామ్కోకు చెందిన హెలికాప్టర్ ఆదివారం ఉదయం కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా సౌదీ జాతీయులేనని ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. సౌదీ తూర్పు తీరంలోని రస్ తనూరా ప్రాంతంలో ఆదివారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై ఇంధన మంత్రిత్వ శాఖ అధికారికంగా సమాచారం అందించినట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ పేర్కొంది. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాదానికి గల కారణాలు ఇప్పటివరకు వెల్లడికాలేదు. హెలికాప్టర్ సాంకేతిక లోపం వల్ల కూలిందా, లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనపై సౌదీ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం ప్రమాదానికి గల అసలు కారణాలను వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై సౌదీ అరామ్కో సంస్థ అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. మృతుల కుటుంబాలకు ఇంధన మంత్రిత్వ శాఖ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొంది. మృతుల గుర్తింపు, ఇతర వివరాలను సంబంధిత కుటుంబాలకు తెలియజేస్తున్నట్లు సమాచారం. రస్ తనూరా ప్రాంతం సౌదీ అరేబియా ఇంధన రంగానికి అత్యంత కీలకమైన కేంద్రంగా గుర్తింపు పొందింది. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతి టెర్మినల్లలో ఒకటి ఇక్కడ ఉండటంతో ఈ ప్రాంతానికి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా కొంతకాలం నిలిచిపోయిన కార్యకలాపాలు ఇటీవలే పునఃప్రారంభమైన నేపథ్యంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హంగా మారింది.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష

(మొదటిపేజీ తర్వాత)

ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఈ నెల 20 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఇప్పటికే అక్కడ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష ప్రారంభించిన అనంతరం సోనమ్ వాంగ్‌చుక్ మాట్లాడుతూ తమ ఉద్యమం కేవలం నీట్ పరీక్షకు పరిమితం కాదని, దేశంలోని మొత్తం విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. పరీక్షల నిర్వహణలో లోపాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీజేపీ నేతలు తెలిపిన వివరాల ప్రకారం, నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన లోపాల కారణంగా దేశవ్యాప్తంగా 21 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపించారు. వారి స్మారకార్థం దీక్షా స్థలంలో ప్రత్యేక స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శక విధానాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మరోవైపు, సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష ప్రారంభించిన తర్వాత జంతర్‌మంతర్ వద్ద ప్రభుత్వం, పోలీసులు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని సీజేపీ ఆరోపించింది. తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు నిలిపివేశారని పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విమర్శించారు. పలుమార్లు అధికారులను, పోలీసులను సంప్రదించినప్పటికీ స్పందన రాలేదని, వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ నెల 20న ప్రారంభమైన నిరసన కార్యక్రమంలో ప్రభుత్వం స్పందించకపోతే జూన్ 28 నుంచి తాను ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని సోనమ్ వాంగ్‌చుక్ ముందుగానే ప్రకటించారు.

# రూ.13,060 కోట్లతో రాష్ట్ర రహదారుల విస్తరణకు శ్రీకారం

(మొదటిపేజీ తర్వాత)

రహదారుల నిర్మాణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా కనగల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పైలాన్ ఆవిష్కరించి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.13,060 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 34 ప్యాకేజీలుగా మొత్తం 6,092 కిలోమీటర్ల పొడవున 441 రహదారులను విస్తరించి, అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో రహదారి అనుసంధానం మరింత బలోపేతం కానుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మెరుగైన రహదారులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, పారిశ్రామిక పురోగతికి, ప్రజల రాకపోకలకు కీలకమని అన్నారు. అన్ని ప్రాంతాలకు నాణ్యమైన రహదారి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పైలాన్ ఆవిష్కరణ అనంతరం ముఖ్యమంత్రి స్థానిక ప్రజలను పలకరిస్తూ వారితో కరచాలనం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొంటూ ప్రభుత్వ సంకల్పాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ రహదారి విస్తరణ పనులు రాష్ట్ర రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దనున్నాయని అధికారులు తెలిపారు.

# ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తుల జనం



విజయవాడ అనంత సూర్య న్యూస్: వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఈరోజు ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు భక్తులకు కల్పించిన సౌకర్యాలపై హర్షం విజయవాడ :ఇంద్రకీలాద్రిపై వేంచేసి యున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వరుస సెలవుల నేపథ్యంలో ఈరోజు ఉదయం 7 గంటల నుంచే భక్తుల రాక విపరీతంగా పెరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు డీఈఓ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షణలో ఆలయ ఏఈవోలు.బిచంద్రశేఖర్ ,వెంకటరెడ్డి ,రమేష్ బాబు క్యూలైన్లు పర్యవేక్షణ చేయగా భక్తులకు కావలసిన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.రద్దీ అత్యంత భారీగా పెరగడంతో, సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు అధికారులు ఉదయం 10.30 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2.30 గంటల వరకు అన్ని రకాల వీఐపీ ( విప్ ) దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల క్యూ లైన్లలోని సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం అత్యంత వేగంగా, సులభంగా లభించింది.కొత్త నీటి సరఫరా విధానానికి విశేష స్పందన:ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సరికొత్త నీటి సరఫరా విధానాన్ని ప్రవేశపెట్టారు. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తుల వద్దకే నేరుగా సరికొత్త మొబైల్ వాటర్ క్యాన్ల (సంచార నీటి డబ్బాల) ద్వారా చల్లని తాగునీటిని అందించారు. ఈ వినూత్న ప్రయోగం పట్ల భక్తుల నుంచి విశేష ప్రశంసలు వ్యక్తమయ్యాయి. ఎండలో అలసిపోయిన తమకు లైన్లలోనే నీరు అందించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీనితో పాటు ఆలయ పరిసరాల్లో నిరంతరాయంగా ఉచిత ప్రసాదం, అన్నదానం విరివిగా పంపిణీ చేశారు.భక్తుల సేవలో పాలకమండలి, అధికారులు:మధ్యాహ్నం 2.30 తర్వాత భక్తుల రద్దీ క్రమంగా తగ్గింది. ధర్మకర్తల మండలి సభ్యులతో కూడా స్వయంగా క్యూ లైన్లలో పర్యటించి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. భక్తులతో కలిసి ఉంటూ వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు సిబ్బందితో క్యూ లైన్లను క్రమబద్ధీకరించేందుకు ఆలయ సహాయ కమిషనర్ రంగారావు ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు ఇస్తూ ఎంతో శ్రమించారు.పాలకమండలి, అధికారుల సమన్వయం, కఠిన శ్రమ కారణంగా ఇంతటి భారీ రద్దీలోనూ భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది కలగకుండా అమ్మవారి దర్శనం అత్యంత ప్రశాంతంగా జరిగింది. ఆలయ యంత్రాంగం చేసిన ఏర్పాట్లపై భక్తులు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు.

# రెవెన్యూ భవన్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**అర్జీలను “మీకోసం .ఏపీ .జివోవి .ఇన్ “ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చు**

**అర్జీల పరిష్కార సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు**

**జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్**



పుట్టపర్తి,జూన్ 28, అనంత సూర్య న్యూస్:శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలో గల రెవెన్యూ భవన్ (ఎస్.ఆర్. శంకరన్ హాల్) లో నేడు జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించ బడుతుంది.ప్రజలు ఈ మార్పును గమనించి సంబంధిత వేదికకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ నెల 29న సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల,డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా రేవెన్యు భవన్కు వచ్చే అవసరం లేకుండా “మీకోసం .ఏపీ .జివోవి .ఇన్ లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. రేవెన్యు భవన్లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రాత్రివేళ బుల్లెట్ పై నగర వీధుల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి




అనంతపురం, జూన్ 28 అనంత సూర్య : తెల్లవారుజామున బుల్లెట్ పై నగర వీధుల్లో తిరుగుతూ సమస్యలు తెలుసుకునే ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రాత్రి వేళలో కూడా ఆ తరహా పర్యటనలు చేస్తున్నారు. ఇటీవల ప్రజా దర్బార్ లో వచ్చిన ఫిర్యాదులను స్వయంగా తెలుసుకునేందుకు ఆయన శనివారం రాత్రి బుల్లెట్ పై నగర వీధుల్లో తిరిగారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టే ఉద్దేశంతో రాత్రివేళ బుల్లెట్పై నగర ప్రధాన వీధుల్లో ప్రత్యేక పర్యటన నిర్వహించారు. నగరంలోని టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, గుత్తి రోడ్డు, ఓల్డ్ టౌన్ ప్రాంతాల్లో పర్యటిస్తూ వీధిలైట్లు, రహదారుల పరిస్థితులు మరియు ఇతర ప్రజా సమస్యలను పరిశీలించారు. ఎక్కడికక్కడ గుర్తించిన సమస్యలను నోట్ చేసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పవిత్ర మొహర్రం సందర్భంగా ముస్లిం సోదరులను కలిసి వారి ఏర్పాట్ల గురించి తెలుసుకుని, వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. అనంతరం వారితో కలిసి టీ తాగుతూ కొంతసేపు గడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటున్నామని తెలిపారు. నగరంలో గుర్తించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం తమ బాధ్యత అని, అనంతపురం నగర అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

# పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాలి




అనంతపురం, జూన్ 28 అనంత సూర్య : పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అక్కడికి వచ్చిన చిన్నారులు, తల్లిదండ్రులను ఆప్యాయంగా పలుకరించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఉదయాన్నే పోలియో చుక్కలు వేయించుకునేందుకు వచ్చిన వారందర్నీ అభినందించారు. అనంతరం ఆమె స్వయంగా పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించే బాధ్యత తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత సూచించారు. అక్కడక్కడ కొందరు దీని పట్ల నిర్లక్ష్యం వహించడం వలన ఇంకా 100శాతం పోలియో నిర్మూలన సాధ్యం కాలేదన్నారు. అయితే ఆ లక్ష్యానికి దగ్గరగా ఉన్నామని.. నిండైన జీవితానికి రెండు చుక్కలు వేయించాలన్నారు. ఆదివారం రోజు పోలియో చుక్కలు వేయించుకోని వారికి సోమ, మంగళ వారాల్లో కూడా ఆశా వర్కర్లు, అంగన్వాడీ కేంద్రాల్లో పోలియో చుక్కలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎవరూ ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని ఎమ్మెల్యే సునీత సూచించారు..

# కానూరు పంచాయతీ లోని పెద్ద కానూరు గ్రామంలో కృష్ణ జిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి - గోపు సత్యనారాయణ



కానూరు అనంత సూర్య న్యూస్: మన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమన్ని మన విలేజ్ క్లినిక్ లో పల్స్ పోలియో బూత్ నందు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో పోలియో వంటి భయంకరమైన వ్యాధి నుంచి మీ చిన్నారులను కాపాడే ఈ రెండు చుక్కలు ఉచితం, సురక్షితం, అత్యంత ప్రభావవంతం అని తెలియచేశారు, మన గ్రామంలో ఈ కార్యక్రమం జూన్ 28 నుంచి జూలై 1 వరకు పల్స్ పోలియో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 0-5 ఏళ్లలోపు అన్ని పిల్లలకు.. ఇదివరకు టీకాలు ఉన్నా లేకపోయినా.. రెండు చుక్కలు బైవాలెంట్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ ( వివో పివి ) ఇస్తారనీ తెలిపారు.ఇది రొటీన్ ఇమ్మ్యునైజేషన్కు అదనంగా గట్ ఇమ్యూనిటీ ఇచ్చి, కమ్యూనిటీని రక్షిస్తుందని తెలిపారు.పిల్లలను పోలియో వ్యాధి బారి నుండి రక్షించేందుకు తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని గోపు సత్యనారాయణ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ బ్యాల శ్రీదేవి , పీత రాము, మోపిదేవి కృష్ణామూర్తి, గోపు వెంకటరమణ, విజయ్, బొమ్మిడి నాగరాజు, వీర వెంకట నరసింహారావు, నాగిడి వెంకట నాగేశ్వరావు,ఆశ వర్కర్లు, స్వర్ణ గ్రామ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది,పిల్లల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం నిర్వహిస్తాం -జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం అనంత సూర్య న్యూస్: ఈ నెల 29వ తేదీ సోమవారం కలెక్టరేట్



సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం -- ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక- కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదుచేసుకోవడంతోపాటు వారిఅర్జీస్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ఆర్టీవో కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ లు కూడా యధా విధంగా జరుగుతాయి.కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, కృష్ణా, మచిలీపట్నం వారిచే జారీ చేయబడింది.

# ఆసక్తి కరంగ క్రికెట్ పోటీలు

కదిరి,జూన్28,అనంత సూర్య న్యూస్:కదిరి డిగ్రీ కళాశాల మైదానం నందు



జరిగిన క్రికెట్ పోటీలు ఆసక్తి గా జరిగాయి.లెదర్ బాల్ విభాగం లో జరిగిన టీ20 క్రికెట్ పోటీలో ఏసీఏ సబ్ సెంటర్ సీనియర్స్ జట్టు షాదాన్ అద్భుత హాఫ్ సెంచరీ 70 పరుగుల సహాయం తో 20 ఓవర్లలో 174 పరుగులు చేశారు.యుక్తి 3 నవదీప్ 2 వికెట్లు తీశారు. ఆ తరువాత బ్యాటింగ్ చేసిన అండర్ 19 జట్టు కేవలం 100 పరుగులు మాత్రమే చేయగలిగారు. మొహమ్మద్ 40 పరుగులు చేయగా, చంద్ర,యునస్ చెరో రెండు వికెట్లు తీశారు.టెన్నిస్ బాల్ విభాగశీ లో జరిగిన మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన కదిరి యంగస్టర్స్ జట్టు 20 ఓవర్లలో 142 పరుగులు చేశారు.సిద్ధిక్ 46 పరుగులు,బాలాజీ 6 వికెట్లు తీశారు.ఆ తరువాత బ్యాటింగ్ చేసిన కదిరి టైటాన్స్ జట్టు యాగ్నేష్ బౌలింగ్ ధాటికి ( 6 వికెట్లు ) 107 పరుగులకు అల్ అవుట్ అయ్యారు.ఈ పోటీలను కదిరి మండల క్రికెట్ సంఘం సభ్యులు,సీనియర్ క్రీడాకారులు,ప్లేయర్స్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వీక్షించారు.






# జిల్లాలో ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోన్న మొహరం వేడుకలు

**జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీస్ ఆదేశాల మేరకు**

**పోలీసుల పటిష్ట బందోబస్తు చర్యలు**



అనంత క్రైమ్, జూన్ 28 ( అనంత సూర్య) : జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలలో జరుగుతున్న మొహరం వేడుకలలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం అత్యంత పటిష్టమైన చర్యలు చేపట్టింది. పీర్ల పండుగ ముగిసే వరకు ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఐపీస్ ఆదేశాల మేరకు ఆయా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలలో ప్రజలతో సమావేశమై వేడుకల వేళ ఏమి చేయాలో, ఏమి చేయకూడదో సూచిస్తున్నారు.

# ఈనెల 29వ తేదీన జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉండదు

**జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని**

**జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఐపీస్ విజ్ఞప్తి**

అనంత క్రైమ్, ( జూన్ 28 అనంత సూర్య ): గౌరవ భారత రాష్ట్రపతి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బుక్కరాయసముద్రం మండలంలోని కేంద్ర విశ్వవిద్యాలయం (సెంట్రల్ యూనివర్సిటీ) స్నాతకోత్సవంలో జూలై1న పాల్గొనేందుకు విచ్చేస్తున్న విషయం తెలిసిందే. వివిఐపిల పర్యటన ఉ భద్రత కోసం నియమించబడిన అధికారులందరితో ముందస్తు భద్రతా సమన్వయం చేస్తున్నందున, ఈనెల 29వ తేదీన సోమవారం అనంతపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉండదని జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఐపీస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి అర్జీలు ఇచ్చేందుకు జిల్లా పోలీసు కార్యాలయంకు ఎవరూ రావద్దని విజ్ఞప్తి చేశారు

# 0 – 5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి..

**అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ...**



అనంత వైద్యం , జూన్ 28 :( అనంత సూర్య) : అనంతపురం నగరంలోని కోర్టు రోడ్ లో ఉన్న నెహ్రూ మునిసిపాలిటీ కార్పొరేషన్ స్కూల్ లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, మరియు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, తదితరులు ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యే పిల్లలకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. అనంతరం కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు.

– ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల మధ్యనున్న ప్రతి పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, పోలియో చుక్కలు వేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ప్రజలందరూ ఉచితంగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తెలియజేశారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు రెండు చుక్కలు వేయించి అంగవైకల్యం నుంచి రక్షించాలని, వారి జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందని, ఎన్ని పనులు ఉన్నా ఈరోజు తప్పకుండా పిల్లలకి పల్స్ పోలియో వేయించాలని తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని.. 5ఏళ్ల లోపు పిల్లలకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించేలా చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. పోలియో మహమ్మారి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే అన్నారు. 100 శాతం నిర్మూలనకు మనం దగ్గర్లో ఉన్నామని.. ఇంకా కొంత మంది అవగాహన లేకనో లేదా నిర్లక్ష్యంతోనే ఉంటున్నారన్నారు. అందుకే 5ఏళ్ల లోపు పిల్లలు పోలియో చుక్కలు వేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాలో 2,83,430 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేశారన్నారు. మొత్తం 1,623 కేంద్రాలతో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్లు ఇలా అన్ని చోట్ల పోలియో చుక్కలు వేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఈబి.దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంతరావు, యంఎచ్ఓ సునీత, జిల్లా ఇమ్యునైజేషన్ ఇంచార్జ్ అధికారి డాక్టర్ ప్రసన్న భారతి, డెమో నాగరాజు, ఎచ్ఈఓ గంగాధర్, ఏఎస్ఓ ప్రవీణ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ ది పూటకో మాట.. రోజుకో విధానం




అనంతపురం, జూన్ 28 అనంత సూర్య : హిందూపురం పార్లమెంట్ టి.ఎన్.టి.యు.సి జిల్లా సెక్రెటరీ రాజు రాయల్ మాట్లాడుతూ నిన్నటి రోజు మన వైసీపీ కార్యకర్తలు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. 2014లో వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిండు అసెంబ్లీ సాక్షిగా అమరావతి రాజధానిగా ఒప్పుకున్నప్పుడు మీకు తెలుసు కదా అది మీ సిద్ధాంతం కాదు అని. అలాగే మీరు 2019లో అధికారంలోకి రాగానే మూడు రాజధానులు అంటూ ప్రజల్ని గందరగోళానికి గురి చేయడం నిజం కాదా, ప్రభుత్వం ఉన్నన్ని రోజులు మీ అవినీతికి అడ్డు అదుపు లేకుండా వైసీపీ నాయకులు చెలరేగిపోయారు, అది చూసిన మన ఆంధ్రప్రదేశ్ ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాగానే అమరావతిని పరుగులు పెట్టిస్తున్నారు.అది చూసి ఓర్వలేక మరల మావిగనని పేరుతో రాజకీయం చేస్తున్నారు.అదే మావిగన్ విషయాన్ని మీరు ప్రభుత్వంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదా? ఏదో ఇప్పుడు కూటమి ప్రభుత్వం మంచి చేస్తుందన్న భయంతో రాజకీయ ఉనికి కోసం ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు.ముఖ్యంగా కాపు నాయకుల్ని రెచ్చగొడుతున్నారు. పేరి నాని,అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్ ఇలాంటి కాపు నాయకులు వైసిపికి కొమ్ముకాస్తూ, కులవిద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్నారు. నేను ముఖ్యంగా కాపు నాయకులను అడుగుతున్న 2019 నుంచి 2024 వరకు మీరే ప్రభుత్వంలో ఉన్నారు. మంత్రి పదవులు అనుభవించారు.కాపులకు మీరు ఏమి చేశారో వివరించండి, మేము కాపులకు ఇది చేశామని చెప్పండి అంతేగాని లేనిపోని విషయాల్లో కూటమిలో ఉన్న పవన్ కళ్యాణ్ ని టార్గెట్ చేస్తున్నారు.కల్లి బొల్లి కబుర్లు చెప్పుతూ కాపు నాయకుల్ని రెచ్చగొడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న కాపు నాయకులు కక్ష సాధింపుకు పోవకుండా అభివృద్ధి వైపు నడుస్తుంటే వైసీపీ నాయకులకు నచ్చడం లేదు, అందుకనే ఏదో ఒక విషయం తీసుకొని కాపు నాయకులు రెచ్చగొడుతున్నారు. అందుకని కూటమిలో ఉన్న నాయకులు గాని కార్యకర్తలు కానీ అప్రమత్తంగా ఉండాలి హిందూపూర్ పార్లమెంట్ టిఎన్టియుసి జిల్లా సెక్రెటరీ రాజు రాయల్ విన్నవించారు.

# స్వర్ణ నంది అవార్డు అందుకున్న చెక్కభజన కళాకారిణి ఎస్. మనీష


**మరింత సేవా భావంతో కళారంగంలో ముందుకు సాగుతానన్న ఎస్. మనీష.**

గార్లదిన్నె,జూన్28,అనంత సూర్య న్యూస్:కళారంగంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా చక్కబజన కళాకారిణి ఎస్. మనీష కు స్వర్ణ నంది అవార్డు - 2026 ప్రదానం చేశారు. మెగా ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణ నంది అవార్డ్స్ - డైనమిక్ అవార్డ్స్ కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు.హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఈ వేడుకలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ప్రముఖులను సత్కరించారు. చక్కబజన కళను పరిరక్షిస్తూ, ప్రోత్సహించడంలో ఎస్. మనీష చేసిన కృషిని గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారంతో గౌరవించారు.ఈ సందర్భంగా పలువురు కళాకారులు, సాంస్కృతిక ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చెక్కభజన కళాకారిణి ఎస్. మనీష మాట్లాడుతూ:"స్వర్ణ నంది అవార్డు--2026 అందుకోవడం నాకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఈ అవార్డు నా వ్యక్తిగత విజయమే కాదు, చక్కభజన అనే మన సంప్రదాయ జానపద కళకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. నన్ను ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులు, గురువులు, సహచర కళాకారులు, అభిమానులు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.సంప్రదాయ కళలను భావితరాలకు చేరవేయడం మనందరి బాధ్యత. యువత కూడా జానపద కళల పట్ల ఆసక్తి చూపి వాటిని పరిరక్షించాలని కోరుకుంటున్నాను. భవిష్యత్తులో మరింత అంకితభావంతో చక్కభజన కళ అభివృద్ధికి కృషి చేస్తూ, మరిన్ని ప్రదర్శనల ద్వారా ఈ కళా వైభవాన్ని ప్రజలకు చేరవేస్తాను. భవిష్యత్తులో కూడా సంప్రదాయ కళల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఎస్. మనీష తెలిపారు. కార్యక్రమాన్ని పి. సిరిషా రెడ్డి, మెగా హెల్పింగ్



ఫౌండేషన్ ఎండీ, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు..




*అనంతపురం, జూన్ 28 అనంత సూర్య :*

*రాష్ట్రంలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ పేరుతో సాగుతున్న భారీ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. నిబంధనల ప్రకారం ఆస్పత్రుల నుంచి వచ్చే ప్రమాదకరమైన వైద్య వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వీర్యం చేయాల్సిన 'శ్రీ వెన్' సంస్థ చుట్టూ ఇప్పుడు వివాదాలు ముసురుకుంటున్నాయి. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఈ వ్యవహారంలో తెరవెనుక నడుస్తున్న అసలు బాగోతంపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది.*

### ఆ చెత్త కుప్పల్లో.. కాసుల వర్షం!

ఆస్పత్రుల నుంచి సేకరించే వ్యర్థాలను పారబోసే ప్రాంతాలు కేవలం కాలుష్యానికే కాదు.. అక్రమ సంపాదనకు కూడా అడ్డాగా మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో నిబంధనల ఉల్లంఘనలను చూసీ చూడనట్లు వదిలేయడానికి, సదరు సంస్థకు అనుకూలంగా వ్యవహరించడానికి తెరవెనుక పెద్ద ఎత్తున **'వాటాల'** పంపకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మురికి కూపాలుగా మారిన ఈ వ్యర్థాల సేకరణ సాక్షిగా.. సూట్‌కేసులు మారుతున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### ఎవరి వాటా ఎంత?

ఈ మొత్తం వ్యవహారంలో "ఎవరి వాటా ఎంత?" అనే ప్రశ్న ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నిబంధనలను పర్యవేక్షించాల్సిన కొందరు అధికారులు, ప్రజాప్రతినిధుల అండ దండలతోనే ఈ అక్రమ సామ్రాజ్యం విస్తరించిందనే ప్రచారం జరుగుతోంది. ఆస్పత్రుల నుంచి వసూలు చేసే ఫీజులు, వ్యర్థాల నిర్వీర్యంలో చూపిస్తున్న దొంగ లెక్కల వెనుక కోట్ల రూపాయల చేతులు మారుతున్నట్లు సమాచారం. పర్యావరణాన్ని, ప్రజా ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి శ్రీ వెన్ సంస్థ సాగిస్తున్న ఈ బాగోతంపై విచారణ జరపాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ వ్యక్తపరుస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలను తుంగలో తొక్కి, బయో మెడికల్ వేస్ట్‌ను సాధారణ చెత్తతో కలిపి పారబోస్తున్నా.. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే దానికి.. ఈ **"సూట్‌కేస్ రాజకీయం", "వాటాల పంపకాలే"** కారణమనే నిజాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపితే మరిన్ని సంచలన విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405